నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, సోమవారం 23 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM


# ఏం పాపం చేశాం అమ్మా?

- పదుల సంఖ్యలో తల్లి ఒడిని వీడుతున్న పసి గుడ్లు
- పాపం మూటగట్టుకుంటున్నది ఎవరో తెలియని స్థితి
- కడు పేదరికమనా? ఆడబిడ్డలు భారమవుతున్నారనా?
- దత్తతలోనూ అక్రమ పద్ధతులు.. దొడ్డిదారిన క్రయవిక్రయాలు
- కన్నవారెవరో తెలియక శిశుగృహాల్లో మగ్గుతున్న బాలలు

## కళ్లు తెరవకుండానే పొత్తిళ్లకు దూరమవుతున్న పసికందులు

కళ్లు తెరవకుండానే మీ పొత్తిళ్ల వెచ్చదనానికి దూరమవుతున్న మేము.. 'ఏం పాపం చేశాం అమ్మా?' అంటూ ప్రశ్నలు సంధిస్తున్నట్లుగా కన్పిస్తున్నాయి అభంశుభం తెలియని పసిగుడ్ల మోములు. తల్లెవరో? తండ్రెవరో అనే ఊహ తెలియకుండానే వారు మరో తల్లి ఒడికి చేరుతుండడం ప్రతి ఒక్కరికీ అంతులేని ఆవేదనను కలిగిస్తోంది. కడు పేదరికం, అధిక సంతానం, ఆడబిడ్డలు కావడం వల్ల భారం వంటివి కారణాలుగా భావించి కన్నతల్లులు ఇలాంటి పాపాలను మూటకట్టుకుంటున్నారని సంబంధిత అధికారులు చెబుతుండడం కలిచివేసే అంశం. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఏడాదిలో పది మందికి పైగా అక్రమ దత్తత పేరుతో తల్లి ఒడిని వీడి చివరికి శిశుగృహకు చేరడం అత్యంత విషాదకరమైన విషయం. బాల్యానికి భరోసా ఇవ్వాల్సిన పాలకులు చోద్యం చూస్తుండడంతో అక్రమ దత్తతలు కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సంతానం లేని కొందరు తల్లిదండ్రులు కూడా సక్రమ దత్తతపై అవగాహన లేక పురిటిలోని పిల్లలను దొడ్డిదారిలో కొని తెచ్చుకుంటున్నారు. చివరికి పోలీసు కేసుల్లో చిక్కుకుంటున్నారు. *- భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)*



కొత్తగూడెంలో సమాధిపై వదిలేసిన పసికందు

### ఓ వైపు పేదరికం.. మరోవైపు ఆడపిల్లలంటే భారం..

పేదరికంతో మగ్గిపోతున్న కొందరు తల్లిదండ్రులు.. తమ పిల్లలను పెంచి పోషించలేకపోతున్నారు. దీంతో కడుపారా తాము కన్న బిడ్డలను పరాయి వాళ్లకు విక్రయిస్తున్నారు. ఇదేగాక విచ్చలవిడిగా సంతానాన్ని కంటున్న ఇంకొందరు తల్లిదండ్రులు.. ఆడబిడ్డలన్న కారణంతో అమ్మకాలకు పెడుతున్నారు. ఆనోటా ఈనోటా ఈ విషయం తెలుసుకుంటున్న ఐసీడీఎస్ అధికారులు రంగంలోకి దిగడంతో అసలు గుట్టు రట్టవుతోంది. దీంతో అక్రమ పద్ధతిలో దత్తత తీసుకున్న వారిపై కేసులు నమోదవుతున్నాయి. మరికొన్ని ఘటనల్లో కాలే కడుపులను నింపుకునేందుకు చివరికి పిల్లలను అమ్ముకుంటున్న సందర్భాలూ వెలుగుచూస్తున్నాయి. సమాజంలో తిరిగే కొందరు పెద్ద మనుషులు కూడా అక్రమ దత్తతలకు ఊతమిస్తుండడం గమనార్హం.



చంద్రుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొమ్ముగూడెంలో అక్రమ దత్తత తీసుకున్న కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీడీపీవో సలోమి (ఫైల్)





పిల్లలను అక్కున చేర్చుకుంటున్న భద్రాచలం శిశుగృహ

### ఏడాదిలో పది మందికి పైగా అక్రమ దత్తత..

ఏటా ఐసీడీఎస్, ఐసీపీఎస్, పోలీస్ శాఖలు అక్రమ దత్తతలు గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా చివరికి ఫలితం ఉండడం లేదు. ఈ ఏడాదిలో మణుగూరు మండలం పగిడేరు, టేకులపల్లి, ఇల్లెందు, రామవరం, కొమ్ముగూడెం, కమలాపురం, అశ్వారావుపేట, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ గ్రామాల్లో కొందరు అక్రమ దత్తతలు తీసుకొని పోలీసు కేసుల్లో చిక్కుకున్నారు. వీరిలో కొంతమంది కౌన్సెలింగ్‌కు వచ్చి చట్టం గురించి తెలియదని రాజీ పడ్డారు. మరికొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో ఇప్పటికీ భద్రాచలం శిశుగృహలో పదిమంది పసిపిల్లలు అక్రమ దత్తతతో మిగిలిపోయారు.

### తల్లి ఒడిని వీడినా విదేశాల్లో బతుకులు..

చిన్నప్పుడే తల్లి ఒడిని వీడిన కొన్ని పసి హృదయాలకు మాత్రం దత్తత తీసుకున్న వారు భరోసానిస్తున్నారు. ఇప్పటి వరకు భద్రాచలం శిశుగృహ నుంచి ఒకరిని అమెరికా కుటుంబ సభ్యులు దత్తత తీసుకోగా, మరొకరు ఇటలీ నుంచి వచ్చి దత్తత తీసుకున్నారు. మరొకరిని చండీగఢ్ రాష్ట్రం నుంచి వచ్చి దత్తత తీసుకున్నారు. శిశుగృహ నుంచి దత్తత వెళ్లిన వారి యోగక్షేమాలను ఇక్కడి అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండడం గమనార్హం. పిల్లలు లేని వారు ఎంతోమంది దత్తత కోసం క్యూ కడుతుంటే.. అక్రమ పద్ధతిలో దత్తత తీసుకున్న మరికొందరు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.

### ప్రతీ సమావేశంలో అవగాహన కల్పిస్తున్నాం..



అక్రమ దత్తత నేరమని ప్రతీ సమావేశంలో అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొందరిలో మార్పు రావడంలేదు. ఇందుకోసం పత్రికా ముఖంగా ప్రకటన కూడా చేశాం. సక్రమ పద్ధతిలో దత్తత తీసుకునేందుకు కారా (CARA) అనే వెబ్‌సైట్ ఉంది. దీని ద్వారా దత్తతకు దరఖాస్తు చేసుకుంటే సక్రమ పద్ధతిలోనే దత్తత తీసుకునే వెసులుబాటు ఉంది. ఇందుకోసం బాలల సంరక్షణ కమిటీ కూడా ఉంది. ప్రత్యేక టీం నిత్యం పరిశీలన చేస్తూ ఉంటుంది.

**–స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమ అధికారి, భద్రాద్రి**

# పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలి

- ఎలక్టోరల్ అబ్జర్వర్ బాలమాయాదేవి



మాట్లాడుతున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ బాలమాయాదేవి

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6, 7, 8లను వెంటనే పరిష్కరించాలని, దివ్యాంగ ఓటర్లను గుర్తించాలని ఎలక్టోరల్ అబ్జర్వర్ బాలమాయాదేవి సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తో కలిసి ఆదివారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో నాణ్యమైన ఓటర్ ఎపిక్ కార్డులను ప్రింట్ చేసి పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటరు ఐడీ కార్డుల జారీ, పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లు తదితర అంశాల గురించి వివరించారు. స్పెసల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, తహసీల్దార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రంగాప్రసాద్, బీసీ సంక్షేమాధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లాకు విచ్చేసిన ఆమెకు కలెక్టర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

# భద్రాద్రి ముక్కోటి ఉత్సవాలకు రండి..

- కలెక్టర్‌కు శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఆహ్వానం



ముక్కోటి ఆహ్వాన పత్రికను కలెక్టర్‌కు అందజేస్తున్న ఈవో

కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ భద్రాచలం, డిసెంబర్ 22: జనవరి 9, 10 తేదీల్లో భద్రాచలంలో జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరుకావాలంటూ శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో రమాదేవి.. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌ను కోరారు. కలెక్టరేట్‌లో ఆదివారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా ముక్కోటి ఏర్పాట్ల గురించి ఈవోను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, వసతి, వైద్య, భద్రతా సదుపాయాల వంటివి అందుబాటులో ఉంచాలని సూచించారు. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు.

# సింగరేణి.. అభివృద్ధిలో అగ్రగామి

- గత కేసీఆర్ ప్రభుత్వంలో మరింత తోడ్పాటు
- కార్మికులకు లాభాల్లో వాటా 32 శాతం పెంపు
- సాంకేతికను అందిపుచ్చుకుంటూ ముందుకు..
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం..



సింగరేణి ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లు



కొత్తగూడెంలో విద్యుత్ దీపాల కాంతులతో వెలుగులీనుతున్న సింగరేణి ప్రధాన కార్యాలయం





ప్రకాశం స్టేడియంలో సిద్ధమవుతున్న వేదిక

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 22: అటు అభివృద్ధిలోనూ, ఇటు కార్మికుల సంక్షేమంలో అగ్రగామిగా దూసుకెళ్తోంది ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి. ఆంధ్రా పాలనలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్న ఈ బొగ్గు ఉత్పాదన సంస్థ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో అన్ని రంగాల్లోనూ దూసుకెళ్తోంది. రోజురోజుకూ చేరవవుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ఈ సంస్థ ఏటికేడూ లక్ష్యాలు ఛేదించుకుంటూ వెళ్తోంది. ఇందులో కీలకభూమికగా ఉన్న కార్మికుల సంక్షేమం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో చొరవ తీసుకుంది. కార్మికులకు అప్పటి వరకూ 19 శాతంగా ఉన్న లాభాల్లో వాటాను ఏకంగా 32 శాతానికి పెంచింది. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1989లో సింగరేణి సంస్థ ఆవిర్భవించింది. 1921 డిసెంబర్ 23న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా రూపుదిద్దుకుంది. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా దేశంలోనే ఏకైక బొగ్గు ఉత్పాదన సంస్థగా మన సింగరేణి సంస్థకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ క్రమంలో తెలంగాణ ఆవిర్భావం అనంతరం అప్పటి కేసీఆర్ ప్రభుత్వంలో కొత్త మైన్‌లు, ఓపెన్ కాస్ట్‌ల వంటివి అనేకం ప్రారంభించి సింగరేణి బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి తోడ్పాటును అందించారు. అప్పటికే జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను తెలంగాణ ఏర్పడ్డాక కారుణ్య నియామకాల పేరుతో తిరిగి ప్రారంభించారు. గత ఏడాది వరకు 16 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు, కంపెనీలో ఖాళీలను గుర్తించి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 4,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు ఇంటర్నల్ నోటిఫికేషన్ ద్వారా 3,700 మందికి ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో ప్రమోషన్లు కూడా కల్పించారు.

### కార్మికుల సంక్షేమం కోసం..

ఐఐటీ, ఐఐఎం చదివే కార్మికుల పిల్లలకు ఫీజులు తిరిగి చెల్లించడంతోపాటు రూ.10 లక్షల గృహ రుణాలపై వడ్డీ చెల్లింపు, ఉచిత కరెంట్, ఏసీ సౌకర్యంతోపాటు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం 17 ఓపెన్‌కాస్ట్ మైన్‌లు, 22 అండర్ గ్రౌండ్ మైన్‌లు మాత్రమే నడుస్తున్నాయి. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు వ్యాపార విస్తరణలో భాగంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలో కూడా అడుగు పెట్టి దిగ్విజయంగా ముందుకు సాగుతోంది.

### మితిమీరుతున్న రాజకీయం..

సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో వివిధ కార్యాలయాలకు ఏర్పాటు చేసే విద్యుత్ దీపాలంకరణలో కూడా మూడు రంగులు మాత్రమే కనిపించడంతో సింగరేణిలో రాజకీయ పెత్తనం ఏ మేరకు పెరిగిపోయిందో అర్థమవుతోంది. ఈసారి సింగరేణి డే వేడుకలు కూడా కార్మికుల సందడి లేకుండా అధికారుల హడావిడే కనపడడం, కార్మికుల కుటుంబాలకు నిర్వహించే పోటీలను కూడా ఎలాంటి ప్రచారం లేకుండా నిరాడంబరంగా నిర్వహించడం వంటివి కార్మికులకు విస్మయాన్ని కలిగిస్తున్నాయి.

### వేడుకలకు సర్వం సిద్ధం

సింగరేణి ఆవిర్భావ వేడుకల సెంట్రల్ ఫంక్షన్‌కు కొత్తగూడెం ప్రకాశం స్టేడియం ముస్తాబైంది. సోమవారం సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఏరియాల్లో ఏర్పాట్లు చేశారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా సెంట్రల్ ఫంక్షన్ కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా సంస్థ సీఎండీ బలరాం హాజరవుతారు. సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్య అతిథి ప్రసంగం అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారు.

























# చీపుర్లు పట్టిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

## రోడ్డు ఊడుస్తూ వినూత్న నిరసన



ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రోడ్డు ఊడుస్తూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 22: సమగ్ర శిక్ష ఉద్యోగులు చీపుర్లు పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద రోడ్డు ఊడ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు ప్రజా ఉద్యమాల పోరాట వనిత విమలక్క సంఘీభావం తెలిపారు. పే స్కేల్‌ను వెంటనే ప్రకటించాలని, లేకపోతే ఉద్యమంలో భాగమై పోరాడుతానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ సౌజన్య, అనిల్, నిర్మల, విజయలక్ష్మి, ఇస్మాయిల్, కృష్ణ, ప్రసాద్, సురేశ్ పాల్గొన్నారు.


























